# చీపురు పిల్లలు

రైలు చీకటి వాకిట్లో రాత్రి –
ఆపుకోలేని ఆకలి తాకిడికి మొలకెత్తిన వాడు
ఆకలి పేరుతో
అమ్మ ఒడిలో జోలెగా ఎదిగిన వాడు
అమ్మ చంకకి బరువయినప్పటి నుండే
నడక నేర్చిన వాడు
తనెరిగిన అమ్మ
ఎప్పుడు కనపడకుండా పోతుందో?
నాన్న సంగతి
అమ్మ చెప్పిందో లేదో?
వాడి చదువంతా
వచ్చీపోయే రైళ్లే
అవి నేర్పిన పాఠాలే
ఊహాలోకంలో ఊరేగించినా –
కన్నీటిలో ముంచెత్తినా అవే
అవి విసిరి పారేసే
అసహ్యాల్లో అహంభావాల్లో అట్టహాసాల్లో
కోళ్లు మట్టిలో గింజలేరుకున్నట్టుగానే
వాడి మెతుకులు

ఎక్కడో ఒళ్లెరుగని నిద్రలో పడిపోయినపుడు
రైళ్లు వాడి పక్కనుండి పోయినా
పై నుండి పోయినా వాడికొకటే
జీవన గమనంలో వాడు
చేతులకి చిరిగిన చెప్పులేసుకుని నడిచినా
కాళ్లకు గుడ్డలు చుట్టుకుని ఊడ్చినా ఒకటే

వాడికి ఏర్రైలైనా
ఏ క్లాసైనా ఒకటే
ఏ ఊరైనా ఒకటే
ఏ స్టేషన్లో దించేస్తే ఏం?
ఏ జైల్లో పెడితే వాడికేం?
వాడికి వాడిలాంటి వాళ్లు
ఎక్కడ తారసపడినా
మూలన పడున్న పాత చీపుర్ని
కొత్త చీపురొచ్చి
పలకరించినట్టుగానే ఉంటుంది